క్లుప్తంగా

విద్యార్థులతో జూమ్ మీటింగ్

చంద్రుగొండ: సమాజంలో జరిగే అక్రమాలపై విద్యార్థులు చిన్ననాటి నుండే అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. షీటీం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన జూం మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలు తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. స్థానిక సెయింట్ జోసఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ గంజి స్వప్న, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన పశువైద్యాధికారి

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల పశువైద్యాధికారిగా డాక్టర్ లిఖిత బుధవారం బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన రిక్రూట్‌లో జిల్లా వ్యాప్తంగా పశువైద్యాధికారులను నియమించింది. దీనిలో భాగంగా లిఖితను మండల పశువైద్యాధికారిగా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు చేపట్టిన డాక్టర్ లిఖిత మాట్లాడుతూ.. మండలంలోని పశు సంరక్షణకు చర్యలు చేపడతామని అన్నారు. ఈ సందర్భంగా పశువైద్య సిబ్బంది బాబ్జి, ఇతరులు ఆమెకు అభినందనలు తెలియచేశారు.

సమస్యలు పరిష్కరించాలి

పినపాక: గిరిజన ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రాం టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పండితుల పీఈటీల పోస్టులను పాఠశాల సహాయక పోస్టులుగా ఉన్నతికరించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని, రాష్ట్రంలో అన్ని హాస్టలను అతని పాఠశాలకు కన్వర్ట్ చేసే పోస్టులో మంజూరు చేయాలని సూచించారు. మండల కమిటీ అధ్యక్షుడిగా బి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పి.రామారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వితరణ..

దుమ్ముగూడెం: మండలంలోని ముసలిమడుగు గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత వాగే సత్యం కుటుంబానికి రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో భీమవరపు వెంకటరెడ్డి, తెల్లం హరికృష్ణ, వాగే ఖాదర్ బాబు,కృష్ణమూర్తి, వాగే రాజేశ్వరి, గజేందర్, విజయ్, మద్ది శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

గుండాల: గుండాల మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గుండాల మాజీ ఎంపీపీ ముక్తిసత్యం, గుండాల మాజీ సర్పంచ్ కోరం సీతారాములు ఆధ్వర్యంలో బుధవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. గుండాల మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించి, చెరువులను అభివృద్ధి చేయాలని కోరారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఎట్టి రాంబాబు, పాయం నాగేశ్వరరావు, పాయం నాగేశ్వరరావు, ప్రసాద్, చింతా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌కు సన్మానం

అశ్వారావుపేటరూరల్: స్థానిక వ్యవసాయ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేసి బదిలీపై వెళ్తున్న డాక్టర్ కె.గోపాలకృష్ణను బుధవారం ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ మేరకు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో కళాశాల ప్రొఫెసర్లంతా కలిసి ఆయనను శాలువా కప్పి, జ్ఞాపికలను అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో డీన్ మాట్లాడుతూ.. ఇదే కళాశాలలో వ్యవసాయ విద్యను పూర్తి చేసి, మళ్లీ ఇక్కడే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగాన్ని సాధించిన ఘనత గోపాలకృష్ణకే దక్కుతుందన్నారు. ప్రొఫెసర్లు డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ నాగాంజలి, డాక్టర్ మధుసూధన్‌రావు, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ రెడ్డి ప్రియ, డాక్టర్ శ్రీలత, డాక్టర్ పావని, డాక్టర్ దీపక్ రెడ్డి, డాక్టర్ చరిత పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

అశ్వారావుపేటరూరల్: వరంగల్–నల్గొండ–ఖమ్మం నియోజకవర్గ ఎమ్మెల్సీ టీచర్స్ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ కోరారు. బుధవారం స్థానిక తహసీల్‌లో ప్రధానోపాధ్యాయులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటు నమోదుకు ఉపాధ్యాయులు ఏదైనా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో మూడేళ్ల పాటు పని చేసి ఉండాలని, ఓటు నమోదుకు వచ్చే నెల 6వ తేదీ వరకు గడువు ఉందని అన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ ప్రసాదరావు, డిప్యూటీ తహసీల్దార్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే అజెండా

- సీసీరోడ్ల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం
- ప్రజాసంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే జారే



బూర్గంపాడు: లక్ష్మీపురంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



చంద్రుగొండ: కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

బూర్గంపాడు: అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపురం, నకిరిపేట, టేకులచెరువు గ్రామపంచాయతీల్లో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతులకు కల్పనకు ప్రభుత్వం తగు ప్రాధాన్యతనిస్తుందన్నారు. తొందరలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభిస్తామని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేకు వినతిపత్రాలను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు కైపు లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బాదం రమేష్‌రెడ్డి, తాళ్లూరి జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దామరచర్ల–సీతాయిగూడెం మధ్య ఎదుళ్లవాగుపై ఉన్న చప్టా స్థానంలో హైలెవల్ బిడ్జీ నిర్మాణానికి రూ.1.20 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకే ఇంటింటికి వెళ్తున్నట్లు చెప్పారు. అనంతరం దిశ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన బెండాలపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బొర్రా సురేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్, కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, దారం గోవిందరెడ్డి, ఎస్కె.రసూల్, గుగులోతు బాబు, కె.నర్సింహారావు, అంతటి రామకృష్ణ, యండి.అన్వర్, బడుగు శంకర్, బడుగు కృష్ణవేణి, కె.పుల్లయ్య, ఇస్లావత్ రుక్మిణి పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి



కరకగూడెం: సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

కరకగూడెం: అంకితభావంతో పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన కరకగూడెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పలు రికార్డులను తనిఖీ చేసి పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఎటువంటి సమస్యలు ఉన్న మానసిక ఒత్తిడికి గురికాకుండా తన దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, స్థానిక ఎస్సై రాజేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

భద్రాచలంఅర్బన్: తెలంగాణ అథెంటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో అండర్–16 విభాగంలో భద్రాచలానికి చెందిన ఎస్కె.అఫ్రీన్ జావిలిన్‌త్రోలో ప్రథమ స్థానంలో నిలిచింది. త్వరలో ఒరిస్సా , భువనేశ్వర్‌లో జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం దక్కింది. అయితే సదరు బాలిక తండ్రి ఆటో డ్రైవర్ పనిచేస్తున్నాడు. కుమార్తెను జాతీయ స్థాయి పోటీలకు పంపించలేని ఆర్థిక స్థితిలో ఉండడంతో ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, లక్ష్మి దంపతుల భువనేశ్వర్ వెళ్లేందుకు రవాణా ఖర్చుల నిమిత్తం అఫ్రీన్‌కు రూ.5000 ఆర్థిక సాయాన్ని అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఉపాధ్యక్షుడు అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుపై అవగాహన



గుండాల: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణ

గుండాల: అధిక లాభాలను అందించే మునగ, వెదురు సాగులపై రైతులు దృష్టి సారించాలని ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. మండలంలోని కాచనపల్లి పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు మునగ, వెదరు సాగుపై అవగాహన కల్పించారు. ఉపాధి హామీ ద్వారా గుంతలు తీయడానికి, విత్తన ఖర్చులు పెట్టుబడిని అందించనున్నట్లు తెలిపారు. ఎకరంలో వెయ్యి మొక్కలు నాటు కోవచ్చునని సూచించారు. మునగ ఆకు, కాయలు, గింజలు అన్ని రకాలుగా లాభాలు ఉంటాయని వివరించారు. వెదురును కూడా పొలం గట్లపై పెంచుకోవాలని సూచించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మల్లేష్‌లు ఉన్నారు.

అశ్వారావుపేటరూరల్: మునగ పంట సాగుపై సన్నాచిన్న కారు రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మునగ పంటపై కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పథకం కింద మునగ పంటను సాగు చేసే రైతులకు వంద శాతం సబ్సిడీ అందిస్తామని, ఈ పంట సాగు ద్వారా రైతులకు అధిక ఆదాయం వస్తుందన్నారు. ఐదు ఎకరాలలో లోపు రైతులతోపాటు, అంతకంటే ఎక్కువ సాగు భూములు ఉన్న రైతులు కూడా ఆసక్తి ఉంటే ఈ పంటను సాగు చేయవచ్చన్నారు. సమావేశంలో ఏఓ శివరాం ప్రసాద్, ఎంపీవో సోయం ప్రసాద్, ఈజీఎస్ ఏపీఓ రామచంద్రరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపాన్ని నివారిద్దాం

కరకగూడెం: అయోడిన్ లోపాన్ని నివారించి ఆరోగ్యంగా జీవిద్దామని కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో 'ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం'లో భాగంగా విద్యార్థులకు అయోడైజ్ సాల్ట్ ప్రాముఖ్యతను, అది వాడకుంటే కలిగే రుగ్మతల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ గడ్డం మంజుల, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురంలో మణుగూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏఎన్ఎం, ఆశావర్కర్లు ఎయిడ్స్ బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రక్తమార్పిడి, కలుషిత సూదులు, సురక్షితం కాని లైంగిక సంబంధాలు, హెచ్ఐవీ సోకిన తల్లిని బిడ్డకు వంటి నాలుగు రకాలుగా ఎయిడ్స్ సోకుతుందని తెలిపారు. ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓఆర్‌లు రజిని, నాగభూషణం, ఏఎన్ఎం జయమ్మ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో అన్నదానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న హరిహర క్షేత్రంలో బుధవారం 600 మంది భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా బుధవారం ఉదయం 4 గంటల సమయంలో దాదాపు 300 మంది అయ్యప్ప స్వామి మాలదీక్షను స్వీకరించినట్లు ఆలయ అర్చకులు కొత్తలంక సంతోష్ శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు బుద్దా నరసింహారావు, ఆవుల నారాయణ స్వామిల కటుంబ సభ్యుల సహకారంతో ఘనంగా నిర్వహించామని శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే రోగాలు దూరం

చర్ల: పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలను దూరం చేయవచ్చునని ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ శిరీష సూచించారు. మండలంలోని కందిపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ ఇక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కాచిచల్లార్చిన నీటినే తాగాలని, వేడి ఆహార పదార్థాలనే భుజించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రతీ ఇంటిని వైద్య సిబ్బంది పరిశీలించి పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ స్వరూప, వైద్య సిబ్బంది, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోడు సమస్యలు పరిష్కరించాలి



పొదెం వీరయ్యకు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు, పోడు రైతులు

బూర్గంపాడు: ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని సారపాక, నాగినేనిప్రోలుకు చెందిన పోడురైతులు రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యను కోరారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటనారాయణ ఆధ్వర్యంలో పోడురైతులు బుధవారం పొదెం వీరయ్యను కలిసి వినతిపత్రం అందించారు. తాళ్లూరి చక్రవర్తి పాల్గొన్నారు.

ఏఈఓల నిరసన



ఏడీఏకు మాస్‌లీవ్‌లను అందజేస్తున్న ఏఈఓలు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొంతమంది వ్యవసాయ విస్తరణ అధికారులను సస్పెన్షన్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ మణుగూరు మండల వ్యవసాయశాఖ విస్తరణ అధికారులు బుధవారం మాస్ లీవ్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. సర్వే చేపట్టేందుకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను నియమించాలని విన్నవించినా, వినతిపత్రాలు అందించినా ప్రభుత్వం పట్టించుకోకపోగా.. సర్వేకు నిరాకరించిన రాష్ట్ర వ్యాప్తంగా 165మంది ఏఈఓలను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విస్తరణఅధికారులు మాస్‌లీవ్‌లను మణుగూరు ఏడీఏ బి.తాతారావుకు అందజేశారు.

కేటీఆర్‌ను కలిసిన నాయకులు

భద్రాచలంఅర్బన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో ఉన్న ఆయన ఇంట్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో భద్రాచలం నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం శాలువాతో ఆయనను సన్మానించి, అనంతరం రాముల వారి ప్రసాదాలను, ప్రతిమతను అందజేశారు. ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి బలంగా తీసుకుని వెళ్లాలని, భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు కలిసికట్టుగా ఉండాలని కేటీఆర్ సూచించినట్లు వారు తెలిపారు.

రోడ్లు బాగుచేయాలని వినతి

మణుగూరురూరల్: ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలకు పగిడేరు శాంతినగర్ గ్రామాల్లో ధ్వంసమైన అంతర్గత రోడ్లను బాగుచేయాలని కోరుతూ బుధవారం పగిడేరు యువకులు పంచాయతీ కార్యదర్శి మణికిరణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు, వరదలకు అంతర్గత రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని, రాకపోకలు సాగించాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ యువకులు కుంజా రాజు, శ్రావణ్, రాజా, వజ్జా ఆనంద్, కుంజా ప్రవంత్, శరం నరేష్, బేతమల్ల సుందర్, వజ్జా బక్కయ్య, తాళ్లపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భీం స్ఫూర్తితో ఉద్యమించాలి

గుండాల: ఆదివాసీల కోసం నిరంతరం పోరాడిన కుమురం భీం పోరాట స్ఫూర్తితో సమాజ శ్రేయస్సు కోసం యువత ముందుండాలని పీఏసీఎస్ చైర్మన్ గొగ్గెల రామయ్య, మాజీ జెడ్పీటీసీ కొమరం హన్మంతరావు, మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి పిలుపునిచ్చారు. బుధవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో పాయం రమేష్ అధ్యక్షతన కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈడబ్ల్యూసీఏ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు, సాంబశివరావు, ఉపాధ్యాయులు ముడిగ సమ్మయ్య, హరినాథ్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, యువకులు లక్ష్మయ్య, రమేష్, వినోద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రమ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, జగదీష్ కాలనీ పాఠశాలను మండల విద్యాశాఖాధికారి రమ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ–1 పరీక్షల తీరు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఉపాధ్యాయులందరూ ప్రతిరోజు డైరీ రాయడాన్ని అభినందించారు. ప్రతిరోజు విద్యార్థుల ఆన్లైన్ అటెండెన్స్ నిర్వహణ బాగుందని మండలంలోని ఉపాధ్యాయులందరూ ఉదయం 10 గంటల లోపల అటెండెన్స్‌ని నమోదు చేయాలని ఆమె సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో ఆమె సమావేశం నిర్వహించి, తదుపరి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజాశ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యత్వ లక్ష్యాన్ని చేరుకోవాలి



ములకలపల్లి: మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రాజేశ్

ములకలపల్లి: సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ సూచించిన లక్ష్యాన్ని విధిగా చేరుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రాజేశ్ సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్ నాయక్ అధ్వర్యంలో ములకలపల్లిలో చేపడుతున్న సభ్యత్వ నమోదులో ముఖ్య అతిథిగా పాల్గొని నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్‌స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని అన్నారు. ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు పాలకుర్తి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పూనెం నవీన్, కార్యదర్శి పాయం నర్సింహారావు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోటోజు రాంబాబు, అత్యం సాయి, అర్చన, గంగ, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు..

చర్ల: ప్రపంచంలోనే అత్యధిక పార్టీ సభ్యత్వాలు కలిగి ఉన్న రాజకీయ పార్టీ బీజేపీ అని ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జ్ జన్ను వెంకన్న పేర్కొన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతకుంట, మొగళ్లపల్లి, గొంపల్లి గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బిట్రుగుంట క్రాంతికుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాగా, తొలిరోజు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగింది. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొండేటి చంద్రశేఖర్, నాయకులు ముత్యాల తాతాజీ, ఆలెం సమ్మయ్య, సీనియర్ నాయకులు సాధం లోకనాథం, ఎడవల్లి శేషగిరిరావు, మాదవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న పెద్దిపల్లి రైతులు

మణుగూరురూరల్: తమకు న్యాయం చేయాలని మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ పెద్దిపల్లి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. 30 సంవత్సాల నుంచి పెద్దిపల్లి గ్రామంలో పోడు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అటవీహక్కుల చైర్మన్‌గా పని చేసిన మండారి సతీష్ అనే వ్యక్తి పోడు పట్టాలు ఇప్పిస్తానని, నమ్మబలకగా.. తామంతా రూ.90 వేలను ఇచ్చామని తెలిపారు. తాము సాగుచేసుకుంటున్న పోడుభూములకు పట్టాలు ఇప్పించకపోగా.. తమకు చెందిన ఏడు ఎకరాల రెండు కుంటల భూమిని తన పేరుమీద అక్రమంగా పట్టా చేయించుకున్నాడని, ఇదేంటని ప్రశ్నించినందుకు తమపై దౌర్జన్యానికి దిగుతూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని వాపోయారు. పట్టాల పేరుతో తమను మోసం చేసి అక్రమ వసూలు చేసిన మండారి సతీష్‌పై, అతనికి సహకరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని వారు సంబంధిత ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పెద్దిపల్లి రైతులు ఎట్టి జోగయ్య, మడకం పెద్ద సోమయ్య,మడివి భీమయ్య, మడకం బాబురావు, తాటి దేవయ్య, కణితి భద్రయ్య, పురం భీమయ్య, సోడె ఉంగయ్య,ఎట్టి మాసయ్య, కారం సురేష్, పొడియం దేవయ్య, బాడిశ జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులో జలపుష్పాల వేట!



చేపలు పడుతున్న గ్రామస్తులు



పెద్ద చేపతో యువకుడు

కరకగూడెం: ఊరంతా చేపల వేటలో నిమగ్నమై సందడి చేశారు. ఉదయాన్నే అక్కడికి చేరుకుని తమ వెంట జలపుష్పాలను వేటాడానికి తెచ్చుకున్న వలలు, ఊతలతో చెరువులో దిగారు. చేపలను పట్టుకున్నారు. మండల పరిధిలోని తాటిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని చందకుంటలో బుధవారం చోటుచేసుకున్న ఈ చిత్రాలను 'సాక్షి'తన కెమెరాలో బంధించింది.

సినీ హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు

అశ్వారావుపేటరూరల్: ప్రముఖ హీరో, రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక లక్ష్మీ శ్రీనివాస టాకీస్ వద్ద అభిమానులంతా కలిసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అలాగే స్థానిక అమ్మ సేవా సదనంలో అనాథ వృద్ధులకు, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో రోగులకు ఉచితంగా రొట్టెలు, పండ్లు, పాలు అందించారు. ఈ కార్యక్రమంలో దండు శ్రీనివాసరాజు, ధనబాబు, చైతన్య పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళులు

దమ్మపేట: ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడి చిత్రపటానికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు బుధవారం నివాళులర్పించారు. మండలంలోని ముష్టిబండ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు బండారుపల్లి ప్రసాద్ తండ్రి ఇటీవలే అనారోగ్య కారణంగా మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా.. మృతుడి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంపటి భరత్ పాల్గొన్నారు.